

డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



మన రైతు సంక్షేమం దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో అమలు జరుగుతున్న రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 8లో..

నాజూకు వంటకు అరుదైన గుర్తింపు



ఆత్రేయపురం అంటే గుర్తుకు వచ్చేది పూతరేకు. పూతరేకు అంటే గుర్తుకువచ్చేది ఆత్రేయపురం. ఈ రెండింటి మధ్య అంత బంధం ఉంది. భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. 8లో

న్యూస్‌రీల్

ఆస్పత్రి నుంచి ఎమ్మెల్యే చిట్టిబాబు డిశ్చార్జ్



మామిడికుదురు: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని ఆయన తనయుడు వికాష్‌బాబు మంగళవారం తెలిపారు. పది రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిందిగా వైద్యులు సూచించారన్నారు. విశ్రాంతి అనంతరం నియోజకవర్గ ప్రజలతో ఎమ్మెల్యే చిట్టిబాబు మమేకమవుతారన్నారు. తన ఆరోగ్యం కోసం ఆలయాలు, మసీదులు, చర్చిల్లో పూజలు, ప్రార్థనలు చేసిన ప్రతి ఒక్కరికీ చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లిబృందాల ఆహార పదార్థాలపై రుసుం తగ్గించాలి

అన్నవరం: సొంతంగా వండుకున్న ఆహార పదార్థాలను పెళ్లి బృందాలు రత్నగిరి పైకి తీసుకువెళ్తే దేవస్థానానికి రూ.6 వేలు చెల్లించాలనే నిబంధనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం ఒక పెళ్లి బృందం సభ్యులు 20 మంది కోసం రత్నగిరికి భోజనం తీసుకువెళ్తుండగా టోల్‌గేట్ వద్ద దేవస్థానం సిబ్బంది అడ్డగించారు. దేవస్థానానికి రూ.6 వేలు చెల్లించాక మాత్రమే తీసుకు వెళ్లాలని స్పష్టం చేశారు. దీనిపై పెళ్లి బృందాల సభ్యులకు, దేవస్థానం అధికారులకు వాగ్వాదం జరిగింది. తాము చిన్న పిల్లల కోసం భోజనం తీసుకువెళ్తుంటే ఇలా అడ్డుకోవడం సరి కాదని పెళ్లి బృందాల సభ్యులు చెప్పారు. అయినప్పటికీ దేవస్థానం అధికారులు అంగీకరించలేదు. దీంతో వారు తాము తెచ్చిన ఆహార పదార్థాలను అక్కడే పారబోసి వెళ్లిపోయారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రసారమవ్వడంతో పలువురు స్పందించారు. ఆహార పదార్థాలను కొండ మీదకు తీసుకు వెళ్లేందుకు నిర్ణయించిన రేట్లను మార్చాలని కోరారు. 50 మందికి సరిపడే భోజనాలు తీసుకువెళ్తే రూ.1,500, వంద మందికైతే రూ.3 వేలు, అంతకు మించి తీసుకు వెళ్తే రూ.6 వేలు వసూలు చేయాలని సూచిస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చకచకా నమూనా ఆలయ పనులు



సత్యదేవుని నమూనా ఆలయం, ఇతర నిర్మాణాల ఊహా చిత్రం

అన్నవరం: పదహారో నంబర్ జాతీయ రహదారిపై విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం మార్గం వైపు రత్నగిరి వాసుడు సత్యదేవుని నమూనా ఆలయం పనులు చకచకా సాగుతున్నాయి. వచ్చే కార్తిక మాసం నాటికి నిర్మాణం పూర్తి చేసి, ఆలయాన్ని ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఆలయం కూడా సాక్షాత్తూ రత్నగిరి సత్యదేవుని ఆలయంలా ఉండాలని, ఇందులో శిలామూర్తులను ప్రతిష్ఠించి, పండితులతో త్రికాల పూజలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. గత జూలై తొమ్మిదో తేదీన ఆయన నమూనా ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

70 సెంట్ల స్థలంలో..

ఈ నమూనా ఆలయాన్ని 70 సెంట్ల దేవస్థానం స్థలంలో రూ.3.57 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఆలయం నిర్మిస్తున్న స్థలం జాతీయ రహదారి కన్నా 12 అడుగుల పల్లంలో ఉంది. దీంతో ఆ మేరకు చుట్టూ కాంక్రీట్ గోడ నిర్మించి మధ్యలో గ్రావెల్ వేసి పూడ్చారు. నిర్మాణాలు జరిగే చోట్లు మినహా మిగిలిన స్థలాన్ని పూడ్చి వేస్తున్నారు. నిర్మాణ స్థలం కూడా పూడ్చివేసిన తరువాత స్వామివారి నమూనా ఆలయంతో పాటు ప్రసాద విక్రయ కౌంటర్, ఫుడ్ ప్లాజా, వెహికల్ పార్కింగ్, టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

వర్షాలతో ఆటంకం

వర్షాల కారణంగా పది రోజులుగా పనులు కాస్త నెమ్మదించాయి. వర్షాలు తగ్గాక పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నారు. జాతీయ రహదారి నుంచి ఆలయం వద్దకు చేరుకునేందుకు 20 అడుగుల వెడల్పున సర్వీస్ రోడ్డు కూడా నిర్మిస్తున్నారు. అనకాపల్లి నుంచి రాజానగరం వరకూ జాతీయ రహదారి మూడో లేన్ నిర్మాణం కూడా ప్రారంభం కానున్నందున దీనిని కూడా దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. నమూనా ఆలయాన్ని వచ్చే కార్తిక మాసం నాటికి పూర్తి చేయాల్సిందిగా కాంట్రాక్టర్‌ను ఆదేశించామని అన్నవరం దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.



అధునీకరణకు నోచుకోనున్న అల్లవరం మండలం బోడసకుర్రు - ఓల్డ్ పోస్టాఫీసు రోడ్డు

గ్రామీణ రోడ్లు.. మరింత గుడ్

- జిల్లాలో 27 పీఆర్ రహదారులకు నిధులు
- రూ.49.64 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- 73.932 కిలోమీటర్ల మేర నిర్మాణాలు
- తొలిసారిగా ఎఫ్‌డీఆర్ పరిజ్ఞానంతో పనులు



ఎఫ్‌డీఆర్ రోడ్డుకు సంబంధించి సాంకేతిక పరిశీలనకు నమూనాలు సేకరిస్తున్న పీఆర్ సీఈ అమర్నాథ్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమలాపురం: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కీలక రహదారుల అభివృద్ధికి మార్గం సుగమమైంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా పలు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో తొలి సారిగా ఫుల్ డెప్త్ రిక్లరేషన్ (ఎఫ్‌డీఆర్) సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మొత్తం 27 రోడ్ల నిర్మాణాలకు రూ.49.64 కోట్లు కేటాయించింది. 73.932 కిలోమీటర్ల మేర రోడ్లను ఆధునీకరించనున్నారు.

ఆధునీకరించనున్న ముఖ్య రహదారులు

- రావులపాలెం మండలం గోపాలపురం నుంచి పాడగట్లపల్లి మీదుగా రావులపాడు ఫుట్‌పాత్ వంతెన వరకూ 8.430 కిలోమీటర్ల రోడ్డును రూ.5.58 కోట్లతో నిర్మించనున్నారు.
- ఉప్పలగుప్తం మండలం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎస్.కొత్తపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకూ 4.572 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.28 కోట్లు కేటాయించారు.
- జనుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నడిపూడి ఫుట్‌పాత్ వంతెన వరకూ 4.10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.85 కోట్లు మంజూరయ్యాయి.
- అంబాజీపేట మండలం ముక్కామల నుంచి మడుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా బోడిపాలెం - ముక్తేశ్వరం రోడ్డు వరకూ 3.52 కిలోమీటర్ల రోడ్డును రూ.2.15 కోట్లతో ఆధునీకరించనున్నారు.
- కె.గంగవరం మండలం పేకేరు నుంచి పాలమూరుపాడు వరకూ 3.80 కిలోమీటర్ల రోడ్డును రూ.2.40 కోట్లతో నిర్మించనున్నారు.
- అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాల నుంచి జాంబవానిపేటకు 2.30 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.03 కోట్లు కేటాయించారు.
- వీటితో పాటు మండపేట మండలం ఏడిద నుంచి ఎస్.సావరం, ఏడిద నుంచి సంగమేశ్వరస్వామి ఆలయం, జి.మేడపాడు నుంచి కేశవరం రోడ్లతో పాటు పలు రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు.

ఎఫ్‌డీఆర్ టెక్నాలజీలో ఏం చేస్తారంటే..

- ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానం కింద ఇప్పుడున్న రోడ్డును 4 నుంచి 9 అంగుళాల వరకూ తవ్వుతారు. ఇందులో నాణ్యమైన బ్లాక్ మెటల్ సేకరించి తిరిగి రోడ్డు నిర్మాణంలో వినియోగిస్తారు. రోడ్డు నిర్మాణం 6 అంగుళాలు, 9 అంగుళాలుగా నిర్ధారించిన అనంతరం పాత మెటల్‌తో పాటు అవసరమైన మేరకు బయటి నుంచి గ్రావెల్, మెటల్ తెచ్చి వినియోగిస్తారు.
- ఎఫ్‌డీఆర్ విధానంలో ఒక విధమైన కెమికల్ లిక్విడ్, సిమెంట్ కలిపి రోడ్డుపై తొలి లేయర్ వేస్తారు.
- రోడ్డు నిర్మాణంలో మొత్తం నాలుగు యంత్రాలను వినియోగిస్తారు. ఒక యంత్రం రోడ్డు తొలుచుకుంటూ వెళ్తుంది. రెండో యంత్రం ఎంత మెటీరియల్ కావాలో తీసుకుని, రోడ్డుకు అవసరమైన కెమికల్, గ్రావెల్, సిమెంట్ కలుపుతూ వెళ్తుంది. మూడో యంత్రం రోడ్డు చదును చేస్తుంది. నాలుగో యంత్రం ఆ రోడ్డుపై కెమికల్ ద్రవాన్ని స్ప్రే చేస్తుంది. దీనిని క్రాక్ రిలీఫ్ లేయర్ అంటారు.
- తరువాత తారు (బ్లాక్‌టాప్ – బీటీ) వేయడంతో రోడ్డు నిర్మాణం పూర్తవుతుంది.
- ఇలా నిర్మించే రోడ్లను సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్డుకు మధ్యస్థంగా ఉండే సెమీ రిజిడ్ రోడ్డు అని పిలుస్తారు.

ప్రయోజనాలెన్నో..

- ఎఫ్‌డీఆర్ పరిజ్ఞానం వినియోగించడం వలన రోడ్ల నిర్మాణాలకు కొండలు తవ్వి, మెటల్ సేకరించాల్సిన అవసరం లేదు. పర్యావరణానికి నష్టం జరగదు. సుదూర ప్రాంతాల నుంచి మెటల్ పెద్ద ఎత్తున తీసుకు రావాల్సిన అవసరం ఉండదు. దీనివలన మామూలు విధానంతో పోలిస్తే సగం వ్యయంతోనే ఎఫ్‌డీఆర్ విధానంలో రోడ్డు ఆధునీకరణ పనులు చేయవచ్చు.
- నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన వారు పదేళ్ల పాటు ఈ రహదారి నిర్వహణను చూడాల్సి ఉంటుంది. ఆరేళ్ల తరువాత కొత్తగా బీటీ వేయాలి.
- ఎఫ్‌డీఆర్ పరిజ్ఞానంతో పది కిలోమీటర్ల రోడ్డును కేవలం వారం రోజుల్లో నిర్మించే అవకాశమున్నందున సమయం కూడా కలిసి వస్తుంది.

తొమ్మిది రోజుల పాటు శిక్షణ



ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రహదారుల నిర్మాణాలపై శిక్షణకు రాష్ట్రం నుంచి ఇద్దరు పంచాయతీ రాజ్ (పీఆర్) ఇంజినీర్లను నియమించారు. వారిలో అమలాపురానికి చెందిన పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు ఒకరు. ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్ల నిర్మాణంపై గౌహతి ఐఐటీలో ఆయన తొమ్మిది రోజుల పాటు శిక్షణ పొందారు. గతంలో టెర్రాజైమ్, జియో ర్యాపింగ్ విధానంలో ప్రయోగాత్మకంగా రహదారుల నిర్మాణం, విక్రాన్ ఫైబర్ విధానాల్లో భవనాలు నిర్మించడంలో రాంబాబు క్రియాశీలకంగా వ్యవహరించారు. 'ఎఫ్‌డీఆర్ విధానంలో రహదారి నిర్మాణం చాలా వేగంగా సాగుతుంది. పదేళ్ల పాటు మన్నిక బాధ్యత కాంట్రాక్టర్లదే. మెటల్ కోసం కొండలు తవ్వాల్సిన అవసరం చాలా తక్కువ. ఒక విధంగా చెప్పాలంటే ఇది ఎకో ఫ్రెండ్లీ రహదారి అని చెప్పవచ్చు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభిస్తాం' అని రాంబాబు 'సాక్షి'కి తెలిపారు.



రావులపాలెం మండలం పాడగట్లపల్లి మీదుగా రావులపాడు ఫుట్‌పాత్ వంతెనకు వెళ్లే రహదారి



ఎఫ్‌డీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్ల నిర్మాణానికి వినియోగించే అత్యాధునిక వాహనాలు

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా సవరణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి, అమలాపురం: జిల్లాలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు లోబడి పూర్తి కచ్చితత్వంతో జరుగుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియకు సంబంధించి క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సర్వేలు, విధి విధానాలు, పురోగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్త ఓటర్లను చేర్చడం, తొలగింపు, ఓటర్ల వలసలకు సంబంధించి రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, ప్రతి వారం సమావేశమై పురోగతిని వివరించాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారని తెలిపారు. జిల్లాలో 14,89,430 మంది ఓటర్లు ఉండగా వీరిలో 14,86,590 మంది ఓటర్లను సెప్టెంబర్ 3 వరకు జరిగిన సర్వేలో ధ్రువీకరించామన్నారు. 5,505 మంది ఆబ్సెంట్ కాగా, 5,424 మంది వలస వెళ్లినట్టు గుర్తించామని తెలిపారు. 27,417 మంది ఓటర్లు మరణించినట్టు, 1,873 మంది పేర్లు రెండుసార్లు నమోదైనట్టు నిర్ధారణ అయ్యిందని కలెక్టర్ వివరించారు. చనిపోయిన ఓటర్ల కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసి, ధ్రువీకరించిన తర్వాత మాత్రమే తొలగింపులు చేపడుతున్నామని చెప్పారు. కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపుల విషయంలో ఏవైనా ఫిర్యాదులుంటే ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 14వ తేదీ నాటికి కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపులు, మార్పుల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. వచ్చే నెల 17వ తేదీ నాటికి ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఓటర్ల జాబితా అభ్యంతరాలపై కసరత్తు చేస్తామన్నారు. ఫారం 6, 7, 8కి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 25,050 క్లైయిములు అందాయన్నారు. వీటిని ధ్రువీకరించి, పరిష్కరించామని కలెక్టర్ శుక్లా తెలిపారు.

మహిళా సమాఖ్యలకు రూ.12.25 లక్షల లాభాల పంపిణీ



లాభాల చెక్‌ను అందజేస్తున్న సత్య నాగేంద్రమణి, రామలక్ష్మి తదితరులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 20 పట్టణ మహిళా సమాఖ్యలకు సంబంధించి అమలాపురం పట్టణ సమాఖ్య మొట్టమొదటిసారిగా లాభాలు పంచుకోవడం శుభ పరిణామమని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అమలాపురం సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి అధ్యక్షతన స్థానిక మెప్మా భవనంలో కోనసీమ (అమలాపురం) పట్టణ మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి మాట్లాడుతూ, అమలాపురం పట్టణ సమాఖ్య ఏర్పడి 11 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య ద్వారా వచ్చిన లాభాలు రూ.12.25 లక్షలను పట్టణంలోని 31 వార్డు సమాఖ్యలకు పంచామని వెల్లడించారు. పట్టణ సమాఖ్య పరిధిలోని 31 వార్డు సమాఖ్యల సభ్యులు కట్టిన పొదుపును బట్టి లాభాలు పంచామన్నారు. గత 11 ఏళ్లలో వ్యాపార, పొదుపు అభివృద్ధికి టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) చేసిన కృషిని మెప్మా జిల్లా స్పెషలిస్ట్ మోహన్ వివరించారు. పట్టణ సమాఖ్యను లాభాల బాటలో నడిపిస్తున్న టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్ పాము శ్యామలను నాగేంద్రమణి, రామలక్ష్మి అభినందించారు. సమావేశంలో కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, మెప్మా డీపీఎం యూ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిమ్‌లకు డిజిటల్ కేవైసీ తప్పనిసరి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ నెలాఖరు లోగా తమ సిమ్‌లకు డిజిటల్ కేవైసీ చేయించుకోవాలని జిల్లా టెలికం జనరల్ మేనేజర్ పలివెల రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న నన్నయ సంచార్ భవన్ వద్ద బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం డిజిటల్ కేవైసీ, రీ-వెరిఫికేషన్, ఉచిత 4జీ సిమ్ అప్‌గ్రేడ్ ఉచితంగా చేస్తున్నారన్నారు. డిజిటల్ కేవైసీ చేయించుకోని వినియోగదారుల నంబర్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రాలు, ఫ్రాంచైజీ, రిటైల్ షోరూముల్లో కూడా డిజిటల్ కేవైసీ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు.

గురువులది ప్రత్యేక స్థానం

- జాతి నిర్మాణకర్తలు ఉపాధ్యాయులే..
- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- 36 మంది జిల్లా ఉత్తమ టీచర్లకు అవార్డులు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, డీఈఓ కమలకుమారి తదితరులు

ముమ్మిడివరం: అనాది నుంచీ భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని, తల్లిదండ్రుల తరువాతి స్థానం ఉపాధ్యాయులదేనని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమల కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. చంద్రయాన్-3 ప్రయోగంతో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని, దీనికి ప్రధాన కారణం మన శాస్త్రవేత్తలైతే.. వారిని తీర్చిదిద్దింది మాత్రం ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి, వారిని ప్రోత్సహించి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని చెప్పారు. విద్యార్థుల మేధాశక్తితోనే దేశం సూపర్ పవర్‌గా ఆవిర్భవిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య చక్కటి అనుబంధం ఉండాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు దారి తప్పితే సమాజం హర్షించదన్నారు. అందువలన ఉపాధ్యాయులు తమ ఔన్నత్యాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాల, తరగతి గదిలోకి ప్రవేశించగానే విద్యార్థులే లోకంగా ఉపాధ్యాయులు వ్యవహరించాలన్నారు. అంకితభావంతో వ్యవహరించే ఉపాధ్యాయులకు సమాజమే గుర్తింపునిస్తుందని, అదే అతి పెద్ద అవార్డని చెప్పారు. డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ, జిల్లాలో విద్యా ప్రగతిని వివరించారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి కూడా ప్రసంగించారు. తొలుతగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 36 మందికి అవార్డులు అందజేశారు. అమలాపురం పట్టణానికి చెందిన మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని నామన అక్షిత నృత్య ప్రదర్శన, అమలాపురం మండలం ఎ.వేమవరం ఉన్నత పాఠశాల విద్యార్థుల దేశభక్తి ప్రదర్శన ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం ఏసీ బొజ్జా రమణశ్రీ, జిల్లా సైన్స్ అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేదల 'కాపు' కాస్తూ..

- నాలుగో విడత వైఎస్సార్ కాపు నేస్తానికి సన్నాహాలు
- అర్హుల ఖాతాల్లో రూ.15 వేలు జమ
- ఉమ్మడి జిల్లాలో 1,14,769 మంది లబ్ధిదారులు
- రూ.172.14 కోట్ల మేర చేకూరనున్న లబ్ధి



కాకినాడ సిటీ: కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన పేద మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ కాపునేస్తం పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా కాపు సామాజికవర్గాల్లోని పేద మహిళలకు ప్రభుత్వం భరోసా అందిస్తోంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ మూడు విడతలుగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేయగా తాజాగా నాలుగో విడత నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు నేస్తం నాలుగో విడత సొమ్ముల విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. అర్హులైన ప్రతి కాపు మహిళ బ్యాంకు ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ చేయనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో కాపు నేస్తం కింద 1,14,769 మందికి రూ.172.14 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

ఐదేళ్లలో రూ.75 వేలు

కాపు నేస్తం పథకం కింద 2020 నుంచి 2024 వరకూ ఐదేళ్ల పాటు ఆయా వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.75 వేలు అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు ఆదాయం రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల లోపు ఉన్న వారు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారు, ఆదాయ పన్ను చెల్లించే వారు అనర్హులు. ఇప్పటికే మూడు విడతల్లో ప్రభుత్వం రూ.45 వేలు అందించింది. త్వరలో నాలుగో విడత నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. దీంతో కాపు, ఒంటరి, తెలగ, బలిజ మహిళలకు వరుసగా నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.60 వేల మేర ఆర్థిక సహాయం అందించినట్టవుతుంది.

గడచిన నాలుగేళ్లుగా జిల్లాల వారీగా కాపు నేస్తం లబ్ధిదారులు, లబ్ధి వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2020–21 ఆర్థిక సంవత్సరం		
కాకినాడ	44,957	67.43
కోనసీమ	34,652	51.59
తూర్పు గోదావరి	28,567	42.85
2021–22		
కాకినాడ	40,332	60.49
కోనసీమ	32,188	48.28
తూర్పు గోదావరి	26,525	39.79
2022–23		
కాకినాడ	44,395	66.59
కోనసీమ	34,962	52.44
తూర్పు గోదావరి	29,824	44.73
2023–24 (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం)		
కాకినాడ	46,557	69.83
కోనసీమ	36,823	55.23
తూర్పు గోదావరి	31,389	47.08

భారీ వర్షం.. భక్తుల అవస్థలు

అన్నవరం: రత్నగిరిపై మంగళవారం కురిసిన భారీ వర్షానికి భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం 11.30 నుంచి గంట పాటు కుండపోతగా వర్షం కురిసింది. ఆలయ ప్రాంగణంలోని భక్తులు తడిసి ముద్దయ్యారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎండ నుంచి రక్షణనిచ్చేందుకు గ్రీన్ నెట్ ఉంది. దీనికి ఉన్న చిన్న చిన్న రంధ్రాల ద్వారా వర్షపు నీరంతా ప్రాంగణంలో పడింది. ఆ వాన నీటిలో తడుస్తూనే భక్తులు వెళ్లారు. మరోవైపు రత్నగిరిపై స్వామివారి ఆలయానికి ఇరువైపులా వెడల్పు చేసిన మెట్లపై ఉన్న రేకుకు రంధ్రాలు ఉన్నాయి. ఆ మెట్ల మీదుగా వాన నీరు దర్బారు మండపంలోకి వచ్చేసింది. అలాగే సప్త గోకులంలో పైకప్పునకు కూడా రంధ్రాలు ఉండటంతో అందులోని గోవులు వాననీటిలో తడిసిపోయాయి. వాటికి ప్రదక్షిణ చేసిన భక్తులు తడిసిపోయారు. గోకులం మధ్యన ఉన్న శ్రీకృష్ణుని విగ్రహంపై కూడా వర్షం కురిసింది. ఫలితంగా అక్కడున్న అర్చకులు కూడా తడిసిపోయారు. గోకులం పైకప్పు మీద ప్లాస్టిక్ బరకాల వంటివి కప్పితే వర్షం కురవదు. అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవాలని భక్తులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

వానరం గురుమార్నింగ్!



గొలకోటివారిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న వానరం

కొత్తపేట: అందరూ మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించడం చూసిందో ఏమో.. తన గుణముతో కులమును వెలయించిన హనుమంతుని గురువుగా భావించిందో.. ఆ వానరం భక్తిశ్రద్ధలతో ఆయనకు పూజలు చేసింది! మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం వంతెన వద్ద వేంచేసిన పంచముఖ ఆంజనేయస్వామికి ఆలయ నిర్మాణ కర్త గొలకోటి మాధవరావుతో పాటు గ్రామస్తులు నిత్యపూజలతో పాటు ప్రతీ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ విధంగా ఉదయం స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం అక్కడికి ఒక వానరం వచ్చి అక్కడున్న ఆ పూజా సామగ్రితో ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేసి, స్వామి పట్ల భక్తిని చాటుకుంది. వింతగొలిపిన ఆ సన్నివేశాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఐ.పోలవరం: గ్రామపంచాయతీ శివారు మీనానగరంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మెడ వంపుల గండి పోశయ్య (36) గేదెలు కడగడానికి చెరువులోకి దిగాడు. లోతుకి వెళ్లడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పోశియ్య కోసం గాలించారు. గంట తరువాత పోశియ్య మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షేక్ హుస్సేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

సామర్లకోట: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం కోర్టులో హాజరు పర్చగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా కట్టమూరుకు చెందిన జి.రవికుమార్, ధర్మవరంకు చెందిన యు.ప్రకాశరావు, పి..శ్రీనివాసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకొని కాకినాడ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. ఈ తనిఖీలలో ఎస్సై టి.సునీత, గోపాలకృష్ణ పాల్గొన్నట్లు తెలిపారు.

నాజూకు వంటకు అరుదైన గుర్తింపు

- ఆత్రేయపురం పూతరేకుకు ప్రత్యేక గౌరవం
- ఫలించిన మూడేళ్ల కృషి
- ఈ నెల 15న జీఐ ట్యాగ్
- సర్టిఫికెట్ల ప్రదానం



పూతరేకులు తీస్తున్న మహిళ



ఆత్రేయపురం పూతరేకులు

ఆత్రేయపురం: ఆత్రేయపురం అంటే గుర్తుకు వచ్చేది పూతరేకు. పూతరేకు అంటే గుర్తుకువచ్చేది ఆత్రేయపురం. ఈ రెండింటి మధ్య అంత బంధం ఉంది. తాజాగా ఆ బంధం మరింత బలపడింది. భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. తరతరాలుగా వారసత్వ సంపదగా వస్తున్న పూతరేకుల తయారీలో ఈ ఊరికే పూర్తి స్థాయి గుర్తింపు..హక్కులు ఉన్నాయని తేలింది. ఈ నెల 15న విశాఖపట్నం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఆత్రేయపురం పూతరేకులకు గ్లోబల్ ఇండికేషన్ ట్యాగ్ సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. నాలుగు శతాబ్దాల పేద మహిళల నైపుణ్యం, కష్టానికి గుర్తింపు దక్కే అపూర్వ సన్నివేశం ఆరోజు ఆవిష్కారం కానుంది.

జీఐ కోసం ఎంతో కృషి

తమ ఊరితో ఇంతగా అనుబంధాన్ని పెనవేసుకున్న పూతరేకుకు భౌగోళిక గుర్తింపు రావాలని ఆత్రేయపురం వాసులు చాన్నాళ్లుగా కోరుకుంటున్నారు. మూడేళ్లుగా ఇందుకోసం గట్టిగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్డర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల సంక్షేమ సంఘంతోపాటు మరికొందరు ఈ ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలోని ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ విభాగం ఆధ్వర్యంలో లా స్టూడెంట్స్ వీరికి కృషికి తోడయ్యారు. ఆత్రేయపురం వచ్చి పూతరేకుకూ ఈ గ్రామానికి ఏర్పడిన విడదీయరాని బంధానికి సంబంధించి వివిధ ఆధారాలను సేకరించారు. ఉపాధిగా మారి ఎగుమతుల స్థాయికి చేరిన ఈ ఆహార ఉత్పత్తిపై డాక్యుమెంట్లను తయారు చేశారు. 2021 డిసెంబర్ 13న చెన్నైలోని జియో ఐడెంటిటీ కార్యాలయానికి అధికారికంగా దరఖాస్తును సమర్పించారు. కొద్ది నెలల అనంతరం చెన్నై కార్యాలయంలో దరఖాస్తు ప్రాసెస్ మొదలైంది. ఆధారాలతో సహా హాజరుకావాలని ఇక్కడివారికి ఆహ్వానం అందింది. ఆత్రేయపురం నుంచి ఏడుగురు సభ్యులు జీఐ కార్యాలయానికి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది నిపుణులు వీరిని లోతుగా ప్రశ్నించారు. సమాధానాలు రాబట్టారు. ఈ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా హాజరైన ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసిన గోనెల రాజేంద్రప్రసాద్ జీఐ అధికారుల ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వగలిగారు. దీంతో వారు సంతృప్తి చెందారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న జీఐ జర్నల్ ఆత్రేయపురం పూతరేకుల గురించి ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలుంటే 120 రోజుల్లో తెలియజేయాలని సూచించింది. ఈ గడువు జూన్ 13వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. దీంతో ఆత్రేయపురం వాసుల కల నెరవేరింది. భౌగోళిక గుర్తింపు(జీఐ) లభించింది.

మన రైతు సంక్షేమం దేశానికే ఆదర్శం

- వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి
- ఘనంగా కొత్తపేట ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



చైర్మన్ రవీదేవి, పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ బోస్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో అమలు జరుగుతున్న రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ రెడ్డి రవీదేవి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకరి శుభకరి కల్యాణ మంటపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షత వహించగా మంత్రి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ చింతా అనూరాధ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అయోమయంలో పడిపోయిన పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం రైతు ప్రోత్సాహక పథకాలతో వ్యవసాయంపై నమ్మకం కల్పించారన్నారు. పంటల బీమా ప్రీమియం రాష్ట్రం, కేంద్రం, రైతు చెల్లించగా, కేంద్రం తన వాటా చెల్లించకుండా తప్పుకుంటే రైతు వాటాతో సహా మొత్తం మూడు వాటాల ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి, రైతులకు పరిహారం అందిస్తోందని వివరించారు. ప్రధాని, కేంద్ర మంత్రులు ఏపీ ప్రభుత్వ పథకాలను ఆదర్శంగా తీసుకుని అమలుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అరటి మార్కెట్ విషయంలో రావులపాలెం యార్డుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ మార్కెట్ కమిటీ అవసరాలన్నీ తీరుస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వ్యవసాయ శాఖమంత్రిగా ఉంటే ఏవిధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందో అలా తాను సహకరిస్తానని భరోసా ఇచ్చారు. సామాజిక న్యాయం గురించి గతంలో అందరూ చెప్పిన వాళ్లే, కానీ ఆచరణలో చూపించింది సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పర్యటించడం వల్ల వరుణుడు పారిపోయాడని ఎద్దేవా చేశారు.

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి అయినా మరో ముఖ్యమంత్రికి పరిపాలన బదలాయించే ముందు రూ.4 వేల కోట్ల నుంచి రూ.4.500 కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అప్పగించేవారని, అయితే చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డికి రూ.80 వేల కోట్ల అప్పుతో అప్పగించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పదవులు కేటాయింపులో సామాజిక సమతూకం పాటిస్తూ అన్ని కులాలకు న్యాయం చేస్తున్నారని అభినందించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ రవీదేవి, వైస్ చైర్మన్ ముదునూరి రామకృష్ణంరాజు, పాలక మండలి సభ్యులతో జగ్గిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ రవీదేవి – సర్పంచ్ చంటి దంపతులను మంత్రి, సభ్యులను అతిథులు సత్కరించి అభినందించారు. ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, సభ్యుడు జున్నూరి బాబి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, తోరాటి లక్ష్మణరావు, కె.అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, కుడుపూడి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మునునూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ తమ్మయ్య, రాష్ట్ర శెట్టిబలిజ యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం షాపులకు వేలం ద్వారా లీజుల ఖరారు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మంగళవారం మూడు షాపుల లీజుకు టెండర్ కం బహిరంగవేలం నిర్వహించి ఖరారు చేశారు. బుకింగ్ కాంప్లెక్స్ ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడో నెంబర్ షాపునకు కొబ్బరికాయలు, అరిటిపళ్లు, ఇతర పూజా సామగ్రి విక్రయాలకు రెండేళ్ల కాలపరిమితికిగాను నెలకు రూ.2.12 లక్షలకు వేలం ఖరారైంది. గత ఏడాది ఈ పాట నెలకు రూ.2.09 లక్షలు మాత్రమే. రావిచెట్టు దిగువ భాగాన ఫ్యాన్సీ, బుక్‌స్టాల్ నెలకు రూ.1.96 లక్షలకు వేలం ఖరారైంది. గతంలో ఇది నెలకు రూ.1.65 లక్షలు మాత్రమే. కొండ దిగువన సత్యనికేతన్ పదో నెంబర్ షాపు మూడు సంవత్సరాల కాలపరిమితికి నెలకు రూ.20,600కు ఖరారైంది.

కాలువలో పడిన యువకుడి మృతదేహం లభ్యం

ఉండ్రాజవరం: పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి సాయిరాం(21) సోమవారం దమ్మెన్ను కాలువలో దిగి గల్లంతయ్యాడు. ఎస్సై కె.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు గ్రామానికి చెందిన సాయిరాం కానూరు నుంచి తణుకు బైక్‌పై వెళుతూ ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను వద్ద ఆగి కాలకృత్యాలు తీర్చుకుని కాల్వలోకి దిగగా ప్రమాదవశాత్తు జారీ పడిపోవడంతో గల్లంతయ్యాడని తెలిపారు. అతని ఆచూకీ కోసం గాలించగా మంగళవారం కాకరపర్రు కాల్వ వద్ద అతని మృతదేహం లభ్యమైందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

సామర్లకోట : స్థానిక రైల్వే స్టేషన్, రైల్వే గూడ్స్ యార్డు మధ్యలో గుర్తు తెలియని రైలు ఢీ కొని సుమారు 45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. స్థానిక రైల్వే పోలీసుల కథనం ప్రకారం రైలు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్సై బి. లోవరాజు తెలిపారు. అయితే మార్గ మధ్యలో క్షతగాత్రుడు మృతి చెందినట్టు ఎస్సై చెప్పారు. మృతుడు 5'5 ఎత్తు ఉండి చామన ఛాయలో ఉన్నాడని, తెలుపు రంగుపై నలుపు, నీలం డిజైన్ కలిగిన లుంగీ, మెడలో ఎర్రని తాడుతో ఒక తాయత్తు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు సామర్లకోట జీఆర్పీ రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.11 వేలు మాయం

పి.గన్నవరం: గ్రామంలో నివసిస్తున్న బొరుసు చంద్రశేఖర్‌కు చెందిన రెండు బ్యాంకు ఖాతాల నుంచి సోమవారం రాత్రి అతనికి తెలియకుండా గుర్తు తెలియని వ్యక్తులు రూ.11 వేలు కాజేశారు. ఆధార్ ఎనేబిల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా చంద్రశేఖర్‌కు చెందిన ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.6,500, యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.4,500 తస్కరించారు. సొమ్ము విత్‌డ్రా అయినట్టు అతని సెల్‌కు మెసేజ్ రావడంతో, ఆయన అప్రమత్తమై మంగళవారం బ్యాంకు అధికారులను సంప్రదించారు. తన బయోమెట్రిక్‌ను లాక్ చేసి, అధికారులకు ఫిర్యాదు చేశారు. గత ఆగస్టు 23న తన స్నేహితుడి భూమి విక్రయం నిమిత్తం అంబాజీపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సాక్షిగా తాను బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర వేశానని శేఖర్ బ్యాంకు అధికారులకు తెలిపారు. ఖాతాల్లో సొమ్ము మాయం కావడంపై విచారణ నిర్వహించి, న్యాయం చేస్తామని బ్యాంకు అధికారులు బాధితుడికి చెప్పారు. గతంలో కూడా పలువురి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము మాయం అయింది., మళ్లీ ఇప్పుడు ఈ విధంగా జరగడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

ఉ॥ పొందుపరచిన వస్తు నం. ఎ.0.38½ సెం॥ 1258.4 … 1057. … 1–18సెం …

ఆమలాపురం — శ్రీ డి.వి.వి.యస్.మూర్తి, అడ్వకేట్
తేది. 05-09-2023 — మొబైల్.9848344577

పబ్లిక్ నోటీసు

[illegible]

ఆమలాపురం — శ్రీ డి.వి.వి.యస్.మూర్తి, అడ్వకేట్
తేది. 05-09-2023 — మొబైల్.9848344577

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

▪ కాకినాడ, భానుగుడి, 80 అ॥లు మిలిట్రీ రోడ్డులో దక్షిణం, స్మార్ట్ సిటీ 80 అ॥లు రోడ్డులో E/F కమర్షియల్ స్థలములు, శ్రీనగర్, వెంకటనగర్, శాంతినగర్‌లో కలవు. పి.ఎ.స్వామి, సంప్ర॥ 98481 07949 [R-63]

SITE FOR SALE

▪ Site for Sale East Facing 465 Sq.yds. at Balajinagar, Beside Police Quarters, Rajahmundry. Cont.- ✆ : 94411 44475 [R-4658]

Services

BUSINESS OFFER

హోంకేర్ సర్వీస్

▪ వృద్ధులకు సేవచేయుటకు, చిన్నపిల్లలను చూసుకొనుటకు వంట పనికోసం పనిచేయుటకు మగ/ఆడ వారు కావలెను. వర్కర్లకు మంచి జీతం. ఏజెంట్లకు కమీషన్ ఇవ్వబడును. 9059835761, 8522903927. [W-1229406]

GOLD FINANCE

▪ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

▪ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788217]

▪ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిర ధరకు కొనబడును.(స్పాట్‌క్యాష్).సంప్రది 88024 89999 [B-4654]

Wanted

▪ రాజమండ్రి మొఘల్ బిర్యానీ ప్యాలెస్ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవం గల కెప్టెన్లు, సప్లయర్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. 9 వేలు పైన జీతం + వసతి + భోజనం. Cont : ✆ : 85004 31651 [R-4661]

▪ కష్టమైనా కాదు.VIPఇంట్లోపెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000–35000/- ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 9391753308. [HA-576]

▪ శ్రీసాయిరాం హోంకేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 9666001826, 9666001827 [H-189392]

▪ హైదరాబాద్ స్టార్ హోటల్స్‌లో ఫుడ్ సర్వీస్‌కి క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్+ఫుడ్ ఫ్రీ. జీతం: 18000-24000/- స్త్రా. జా॥ Ph: 9381979061 [HA-2081]

▪ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-569]

▪ వివిధ శాఖలలో కాంట్రాక్ట్ & బెట్ సోర్సింగ్ జాబ్ కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, జా॥అసిస్టెంట్స్, రికార్డ్ అసిస్టెంట్స్, ఆఫీస్ అసిస్టెంట్స్ అ॥ 10th-PG, ఆకర్షణీయమైన జీతం కలదు. 7997699026 [G-7618]

▪ Wanted Collection Executives For Reputed Banks Loans Collection for Vizag, Vijayanagaram, Rajahmundry, Kakinada, Eluru, Bheemavaram, Amalapuram, Guntur Locations. Ph : 93814 11091 [V-583]

WANTED

▪ TV,WASHING MACHINE ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్స్/సర్వీస్ ఇంజనీర్స్ (100) కావలెను. JEEVES కన్స్యూమర్ సర్వీస్ Pvt Ltd (Flipkart company) వారికి తూ'గో' జిల్లా రాజమండ్రి, కాకినాడ, పిఠాపురం, మండపేట, అమలాపురం, అనపర్తి, రావులపాలెం, తుని, గోకవరం, జగ్గంపేట, ప'గో'జిల్లా తణుకు, పాలకొల్లు, ఏలూరు, చింతలపూడి, భీమవరం, కొవ్వూరు, నిడదవోలు నల్లజెర్ల, తాడేపల్లి గూడెం, గోపాలపురం, జంగారెడ్డి గూడెం, నర్సాపూర్, పని చేయుటకు అర్హత.ITI, డిప్లొమా (Freshers can also apply) కావలెను. జీతం+ +TA +DA+ఇన్సెంటివ్స్, Rs 15000–20000 సంప్ర. SBI వీధి ఇన్నీసుపేట, రాజమండ్రి 8884950866, 9494649977. [C-777031]

▪ RJYలో ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు కెప్టెన్స్ & కస్టమర్ రిసీవర్స్, సెక్యూరిటీ గార్డెన్స్, క్లీనింగ్ స్టాఫ్, క్యాషియర్స్ & వెయిటర్స్ మినిమం 2 సం॥ అనుభవం గల వారు కావలెను. 9667060588 [R-6137]

▪ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ /ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు నుండి ఆపైన సంపాదించే అవకాశం. Cont 88854 86421 [G-751662]

▪ రాజమండ్రిలో ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు బిల్లింగ్, అకౌంటెంట్స్, రిసెప్షన్, ఇన్సూరెన్స్ & ఆరోగ్య శ్రీ హెల్ప్‌డెస్క్ నర్సింగ్, ఫార్మసీ, కాంపౌండర్స్, సెక్యూరిటీ, ఆయాలు కావలెను. ✆ : 88864 40927 [R-1171881]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లతో దళారీ వ్యవస్థకు చెక్

జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్



తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్ రామలక్ష్మి పట్నాయక్

తుని: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ప్రైమ్ 2.0 ద్వారా ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు చేయడం వలన దళారీ వ్యవస్థకు చెక్ పడుతుందని జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం పాత పద్ధతి ప్రైమ్ 1.0 నుంచి కొత్తగా తీసుకువచ్చిన 2.0 ను జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక పరమైన ఇబ్బందుల వలన ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ఈ నెల 15 వరకు అనుమతి జారీ చేశారన్నారు. తర్వాత అన్నీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. కొద్దిరోజుల పాటు ఇబ్బందులు ఉన్నా తర్వాత అందరికీ అలవాటు అవుతుందన్నారు. కాకినాడ జిల్లా పరిధిలో 113 గ్రామాలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడానికి అనుమతి ఇచ్చామన్నారు. కొత్త విధానం పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని క్రయ, విక్రయదారుల మధ్య దళారులు ఉండరన్నారు. దస్తావేజు లేఖర్లకు ఇబ్బంది లేదని, ఆన్‌లైన్‌లో వారు కూడా రిజిస్ట్రేషన్లు చేయించవచ్చునన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వివాహ రిజిస్ట్రేషన్‌కు ఎలా అయితే స్లాట్ బుక్ చేసిన తర్వాత తేదీ సమయం ఇస్తున్నారో అదే రీతిలో 2.0కు వర్తిస్తుందన్నారు. తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని రికార్డులను పరిశీలించామన్నారు. సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

1న రెవెన్యూ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు

కాకినాడ సిటీ: అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గ్రామస్థాయిలో ఉన్న వీఆర్ఏ స్థాయి ఉద్యోగి నుంచి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వరకు రెవెన్యూ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కాకినాడలోని రెవెన్యూ సర్వీసెస్ భవన్‌లో ఆయన రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు, ముఖ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఆయా జిల్లాల వారీగా పర్యటనలను చేస్తున్నామన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర స్థాయి కౌన్సిల్‌లో చర్చించి పరిష్కారం కోసం నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కౌన్సిల్ సమావేశానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీసీఎల్ఏ జి.సాయిప్రసాదరావు, డిప్యూటీ కలెక్టర్లు, వీఆర్వో, వీఆర్ఏ అసోసియేషన్ల నాయకులు హాజరవుతారన్నారు. వివిధ రూపాల రీత్యా రెవెన్యూ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావల్సి ఉండగా వాటిని ఈ నెలాఖరులోగా చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థకు సంబంధం లేని పనులను ఆయా జిల్లాల కలెక్టర్లు అప్పగిస్తున్నారని వాటిని పునఃసమీక్షించి రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురాకుండా చూడాలని కోరారు. టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌లతో సమయం వృథా అవుతుందని సరిపడా సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు పితాని త్రినాథరావు, గిరి కుమార్‌రెడ్డి, ఆర్వీ రాజేష్, కోన ఆంజనేయకుమార్, జి.బ్రహ్మయ్య, జి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

AMALAPURAM URBAN DEVELOPMENT AUTHORITY

Roc. No. 1/2023/PLNG/AMUDA Dt: 05-09-2023
Ref: G.O.Ms. No. 35 MA&UD Dept. Dt. 20-03-2023

NOTIFICATION

Amalapuram Urban Development Authority is proposed to issue licenses for the eligible Licensed Technical Persons as Surveyors/ Engineers/ Structural Engineers and Developers/ Builders. Interested persons with eligible qualifications as per G.O.Ms. No. 119 MA&UD Dept. Dt. 28-03-2017 may apply for the licenses. The details are published in the notice board of AMUDA office. For enquiry contact APO, AMUDA. Ph. No. 8074202548.

Dated: 05-09-2023 Sd/- **Vice-Chairperson,**
Amalapuram Urban Development Authority

Office address: D.No. D.No.3-159/22, Block No.1, Vaikunthapuram, Eedarapalli Village, Amalapuram

టెండర్ ప్రకటన

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లా

R.C.No.A./20/2013 (EG/KNSM-tender) Date : 05-09-2023

తూర్పు గోదావరి జిల్లాలో గల 6 మరియు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గల 6 డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు/ జూనియర్ కళాశాల లకు 2023–24 విద్యా సంవత్సరమునకు కూరగాయలు, గుడ్లు, చికెన్, అప్పుడప్పుడు సీజనల్ పండ్లు మరియు అరటి పండ్లు సరఫరా చేయు నిమిత్తం సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ఫారం ఖరీదు రూ.1500/- గా నిర్ణయించబడినది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాకినాడలో చెల్లుబాటు అగునట్లు మాత్రమే "DISTRICT CO-ORDINATOR, APSWREI SOCIETY" వారి పేర డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకొని ది. 07-09-2023 ఉదయం గం. 10.30 ని. నుండి ది. 13 09 2023 సాయంత్రం ఐదు గంటల వరకు కేవలము పనిదినములలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయం, కాకినాడలో అందజేసి టెండర్ దరఖాస్తులు పొందవచ్చును.

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పాఠశాలలు/కళాశాలలకు సంబంధించిన టెండర్ దరఖాస్తులు సీలు వేసి డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, ముమ్మిడివరంలో ది. 15–09–2023 మధ్యాహ్నం 1.30 గం. నుండి 3.00 గం.వరకు సమర్పించగలరు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు.

శ్రీయుత సంయుక్త కలెక్టర్, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి సమక్షములో ది.15–09–2023 మధ్యాహ్నం 5.00 గం.కు సీల్డ్ బాక్సులు తెరిచి వారిచే టెండర్లు ఖరారు చేయబడును.

తూర్పు గోదావరి జిల్లా పాఠశాలలు/కళాశాలలకు సంబంధించిన టెండర్ దరఖాస్తులు సీలు వేసి డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, ధవళేశ్వరంలో ది. 16 09 2023 ఉదయం 12.00 గం. నుండి 1.30 గం. వరకు సమర్పించగలరు. ఆలస్యముగా వచ్చిన దరఖాస్తులు స్వీకరించ బడవు. శ్రీయుత సంయుక్త కలెక్టర్, తూర్పు గోదావరి జిల్లా వారి సమక్షములో ది. 16–09–2023 మధ్యాహ్నం 3.00 గం.కు సీల్డ్ బాక్సులు తెరిచి వారిచే టెండర్లు ఖరారు చేయబడును.

ఎట్టి కారణం చూపకుండా సదరు టెండర్లు పాక్షికంగా గాని, రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని జిల్లా కొనుగోలు కమిటీ వారికి పూర్తి అధికారం కలదు.

సం/- శ్రీయుత **సంయుక్త కలెక్టర్ మరియు చైర్మన్,**
జిల్లా కొనుగోలు కమిటీ,
తూర్పుగోదావరి జిల్లా మరియు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.